తిరుమలాయపాలెంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి కందాళ, చిత్రంలో సంభాని

బీఆర్ఎస్‌తోనే మరిన్ని పథకాలు

- పాలేరు నియోజకవర్గ వ్యాప్తంగా దళితబంధు అందిస్తాం
- ఇందుకోసం కేసీఆర్‌ను మరోసారి ముఖ్యమంత్రి చేద్దాం
- తిరుమలాయపాలెం ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి కందాళ

తిరుమలాయపాలెం, నవంబర్ 23: రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మరోసారి గెలిస్తే మరిన్ని సంక్షేమ పథకాలు అమలవుతాయని పాలేరు ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ ప్రకారం పాలేరు నియోజకవర్గంలో బీఆర్ఎస్ విజయం సాధిస్తే నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల్లోనూ దళితబంధు పథకాన్ని అమలుచేస్తామని అన్నారు. అందు కోసం కేసీఆర్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేద్దామని పిలుపునిచ్చారు. ఆయన మళ్లీ సీఎం అయితేనే నూతన మ్యానిఫెస్టో ప్రకారం మరిన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు. తిరుమలాయపాలెం మండలంలో గురువారం పర్యటించిన ఆయన.. మండల కేంద్రంతోపాటు వెదుళ్లచెరువు, బీచరాజుపల్లి, బాలోజీనగర్, బచ్చోడుతండా, రాజారం, పిండిప్రోలు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన మ్యానిఫెస్టో ప్రకారం తెల్లకార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ సన్నబియ్యం సరఫరా చేస్తామని, సౌభాగ్యలక్ష్మి పథకం ద్వారా పేద మహిళలకు నెలకు రూ.3000 గౌరవ భృతి అందిస్తామని, మహిళలకు రూ.500కే గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తామని, పేద కుటుంబాలకు రూ.5 లక్షల బీమాను వర్తింపజేస్తామని వివరించారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు సంభాని చంద్రశేఖర్ మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నేతలు బానోత్ చంద్రావతి, బాషబోయిన వీరన్న, చావా వేణు, చామకూరి రాజు, కొండ బాల వెంకటేశ్వర్లు, బానోత్ భిక్షం, బాణాల మధుసూదన్‌రెడ్డి, పరికపల్లి చంద్రశేఖర్, కొప్పుల శ్రీను పాల్గొన్నారు.

రైతులంతా రైతుబంధువు వెంటే..

- రాబంధుల రక్త చరిత్ర ఏంటో రాష్ట్ర రైతన్నలకు బాగా తెలుసు
- కర్షకబంధువైన సీఎం కేసీఆరే తెలంగాణ ప్రజలకు శ్రీరామరక్ష
- కొణిజర్ల ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్

కొణిజర్ల, నవంబర్ 23: రైతులంతా రైతుబంధువు వెంటే ఉన్నారని బీఆర్ఎస్ వైరా నియోజకవర్గ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్ పేర్కొన్నారు. రాబంధుల రక్త చరిత్ర ఏంటో రైతన్నలకు బాగా తెలుసునని అన్నారు. కర్షకబంధువైన కేసీఆరే తెలంగాణ ప్రజలకు శ్రీరామరక్ష అన్నారు. అందుకే నిరంతరం రైతుల పక్షాన ఉండే కేసీఆర్ సర్కారును మరోసారి గెలిపించాలని కోరారు. విద్యుత్ కోతలు, గిట్టుబాటు లేని పంటల ధరలు, సమయానికి అందని ఎరువులు, విత్తనాలే కాంగ్రెస్ పాలనకు సజీవ సాక్ష్యాలని అన్నారు. అందుకని మరోసారి కాంగ్రెస్‌ను కనికరించే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. కొణిజర్ల మండలంలో గురువారం పర్యటించిన ఆయన.. గుండ్రాతిమడుగు, తీగలబంజర, క్రాంతినగర్-1, 2, జంపాలనగర్, మల్లుపల్లి, కొణిజర్ల, బస్వాపురం, లింగగూడెం, బొట్లకుంట్ల గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో సాధించలేని ప్రగతిని పదేళ్లలో సీఎం కేసీఆర్ సాధించి తెలంగాణను దేశానికి ఆదర్శంగా నిలిపారని గుర్తుచేశారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో వైరా నియోజకవర్గం నుంచి తనను గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు వై.చిరంజీవి, ఏలూరి శ్రీనివాసరావు, పోట్ల కవిత, కిలారు మాధవరావు, పోట్ల శ్రీనివాసరావు, బోడపోతుల బాబు, పాముల వెంకటేశ్వర్లు, భాగం వెంకటేశ్వరరావు, బాణాల వెంకటేశ్వరరావు, కిలారు కిరణ్, జడ మల్లేశ్ యాదవ్, దొడ్డపునేరి రామారావు, రాయల నాగేశ్వరరావు, భూక్యా మాన్‌సింగ్, వేణు, సురేశ్, షేక్ అబ్దుల్‌బీ, లీలాప్రకాశ్, పోగుల శ్రీను, వెంకటరత్నం, పాసంగులపాటి శ్రీను, అనుమోలు శ్రీను, వడ్లముడి శివ, ధరావత్ బాబులాల్, చోడే రమేష్, చోడే శ్రీలత, లకావత్ విజయ్, భూక్యా మీటు, తాళ్లూరి చిన్నపుల్లయ్య, సాయిన్ని నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.



కొణిజర్ల ప్రచారంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్

అభివృద్ధి వెంటే ఖమ్మం ప్రజలు

- ఈ నియోజకవర్గంలో బీఆర్ఎస్ గెలుపును మరెవ్వరూ ఆపలేరు..
- నేను ఇక్కడి వాడిని కాబట్టే ఖమ్మం నియోజకవర్గాన్ని నంబర్‌వన్‌గా నిలిపా..
- గతంలో మంత్రిగా చేసిన తుమ్మల అప్పుడే ఎందుకు అభివృద్ధి చేయలేదు?
- ఆత్మీయ సమ్మేళనాలు, డివిజన్ల ప్రచారాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి అజయ్‌కుమార్

ఖమ్మం, నవంబర్ 23: ఖమ్మం ప్రజలందరూ అభివృద్ధి వెంటే ఉన్నారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, బీఆర్ఎస్ ఖమ్మం నియోజకవర్గ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ స్పష్టం చేశారు. ఈ నియోజకవర్గంలో బీఆర్ఎస్ గెలుపును మరెవ్వరూ ఆపలేరని తేల్చిచెప్పారు. తాను ఇక్కడి వాడిని కాబట్టే, ఇక్కడి ప్రజల కష్టాలు తెలిసిన వాడిని కాబట్టే ఖమ్మాన్ని అద్భుతంగా తీర్చిదిద్దానని, ప్రజల కష్టాలకు పరిష్కారం చూపానని గుర్తుచేశారు. ఖమ్మం నగరంలో గురువారం పర్యటించిన ఆయన.. పలు డివిజన్లలో ఆత్మీయ సమ్మేళనాలు, ఇంటింటి ప్రచారాలు, రోడ్‌షోలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగర ప్రజలకు కావాల్సిన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించానని, అభివృద్ధిలో మొదటిస్థానంలో నిలిపానని అన్నారు. ప్రభుత్వం నుంచి అత్యధిక నిధులు తెచ్చి నిర్విరామంగా పనిచేయడం వల్లనే ఇంతటి ప్రగతి సాధ్యమైందని అన్నారు. మంత్రిగా ఉండి కూడా అధికారులను వెంటబెట్టుకొని నగరంలోని ప్రతి వీధినీ పరిశీలించానని అన్నారు. అభివృద్ధి కోసం అక్కడికక్కడే అంచనాలు వేయించి నిధులు మంజూరు చేయించి పనులు పూర్తి చేశానని వివరించారు. ఇంతకుమునుపు మంత్రులెవరూ ఇలా సైకిళ్లపై తిరిగి పనులు చేయలేదని గుర్తుచేశారు. ఇదే కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు గతంలో టీడీపీ ప్రభుత్వంలోనూ, ఆ తరువాత ఇక్కడి ఎమ్మెల్యేగానూ పనిచేసినప్పటికీ అప్పుడు ఖమ్మాన్ని ఎందుకు అభివృద్ధి చేయలేక పోయారని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో తాను ఖమ్మాన్ని తీర్చిదిద్దితే ఇప్పుడు తుమ్మల ఖమ్మం వచ్చి ఇదంతా అతనే కృషేనని చెప్పుకుంటుండడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. నగరాన్ని అద్భుతంగా అభివృద్ధి చేశాను కాబట్టే ఇక్కడికి అనేక కార్పొరేట్ కంపెనీలు వచ్చి షాపింగ్ మాల్స్ ఏర్పాటు చేస్తున్నాయని వివరించారు. తద్వారా ఇక్కడి యువతకు ఉపాధి అవకాశాలు కూడా లభిస్తున్నాయని అన్నారు. ఈ ఎన్నికల్లో మొదటి బ్యాలెట్‌లో మొదటి సంఖ్యలో ఉన్న కారు గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు కొండ బాల కోటేశ్వరరావు, కూరాకుల నాగభూషణం, కొత్తపల్లి నీరజ, వల్లభనేని రామారావు, దొడ్డ కోటేశ్వరరావు, అడపా వెంకటేశ్వరరావు, మోత్కూరు ప్రసాద్, వెంకటాద్రినాయుడు, జట్ల ప్రసాద్, దొడ్డ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారంలో భాగంగా చిన్నారిని ముద్దు చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి అజయ్

అజయ్‌కి హారతులిచ్చిన మహిళలు..

కాగా, ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ అభ్యర్థి అజయ్‌కుమార్ 13వ డివిజన్‌లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరిస్తుండడంతో అక్కడి మహిళలు ఆయనకు తిలకం దిద్ది మంగళహారతులు పట్టారు.

మభ్యపెట్టేందుకే ఆరు గ్యారెంటీ స్కీములు

- వాటిని నమ్మితే ప్రజలు, రైతులకే ఎక్కువ ప్రమాదం
- పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సత్తుపల్లి సమగ్రాభివృద్ధి
- వేంసూరు ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకటవీరయ్య
- గ్రామాల్లో సండ్ర, పార్థసారథిరెడ్డిలకు ఘన స్వాగతం

వేంసూరు, నవంబర్ 23: ప్రజలను మభ్యపెట్టేందుకే ఆరు గ్యారెంటీ స్కీములంటూ కాంగ్రెస్ ప్రచారం చేసుకుంటోందని సత్తుపల్లి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య విమర్శించారు. కాంగ్రెస్ హామీలను నమ్మితే ప్రజలకు, ముఖ్యంగా రైతులకు ఎక్కువ ప్రమాదమని అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సత్తుపల్లి నియోజకవర్గం సమగ్రాభివృద్ధిని సాధించిందని అన్నారు. ఇంతటి అభివృద్ధిని ఇక్కడి ప్రజలందరూ గమనిస్తూనే ఉన్నారని గుర్తుచేశారు. అందుకని నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసే తనకు ఓట్లు వేయాలని కోరారు. వేంసూరు మండలంలో గురువారం పర్యటించిన ఆయన.. రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డితో కలిసి కల్లూరుగూడెం, మొద్దులగూడెం, బీరాపల్లి, రామన్నపాలెం, వైఎస్ బంజర, రాయుడుపాలెం, మర్లపాడు, లచ్చన్నగూడెం, భీమవరం గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సండ్ర మాట్లాడుతూ.. 50 ఏళ్ల పాటు పాలించిన కాంగ్రెస్ పార్టీ ఏమీ అభివృద్ధి చేయలేకపోయిందని విమర్శించారు. దానిని కప్పిపుచ్చుకునేందుకే అలవిగాని హామీలను ప్రకటిస్తోందని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలతో రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరిందని అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి దళిత కుటుంబానికీ దళితబంధు పథకం అందుతుందని అన్నారు. కాంగ్రెస్ మాటలను నమ్మవద్దని, కరెంట్ మోటర్ల వద్ద జాగారం చేసే రోజులు రానివ్వొద్దని సూచించారు. కేసీఆరే తెలంగాణకు శ్రీరామరక్ష అని స్పష్టం చేశారు. రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రగతి నగర్‌కు చెందిన కాలనీవాసులు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరగా వారందరికీ ఎమ్మెల్యే సండ్ర గులాబీ కండువాలు కప్పారు. ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పగుట్ల వెంకటేశ్వరరావు, గొర్ల సంజీవరెడ్డి, పాలా వెంకటరెడ్డి, పుచ్చకాయల శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ర్యాలీ ముందు భాగాన మహిళల కోలాటం

కాంగ్రెస్ పాలకులతో కర్షకులకు ప్రమాదం

- అందుకే రైతులంతా బీఆర్ఎస్ ప్రభుత్వం వెంటే నడుస్తున్నారు
- దాన్ని ఓర్వలేకనే కాంగ్రెస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారు
- బోనకల్లు మండల పర్యటనలో బీఆర్ఎస్ అభ్యర్థి కమల్‌రాజు

బోనకల్లు, నవంబర్ 23: కాంగ్రెస్ పాలకులతో కర్షకులకు ప్రమాదం పొంచిందని జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ అభ్యర్థి లింగాల కమల్‌రాజు స్పష్టం చేశారు. ఆ విషయం అన్నదాతలకు తెలుసు కాబట్టే వారంతా బీఆర్ఎస్ ప్రభుత్వం వెంట నడుస్తున్నారని అన్నారు. దాన్ని ఓర్వలేకనే కాంగ్రెస్ నేతలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. కర్షకులను కేసీఆర్ నుంచి వేరు చేయాలని చూస్తున్నారని అన్నారు. కానీ కాంగ్రెస్ నేతలు ఎన్ని అబద్ధపు ప్రచారాలు చేసినా కర్షకులు బీఆర్ఎస్ ప్రభుత్వం వెంటే ఉంటారని స్పష్టం చేశారు. బోనకల్లు మండలంలో గురువారం పర్యటించిన ఆయన.. రాపల్లె గ్రామంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వర్షంలో తడుస్తూనే ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజల్లో ఉన్న ఆదరణను జీర్ణించుకోలేకనే రాష్ట్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. వాళ్లు ఎంతలా తప్పుడు ప్రచారాలు చేసినా ప్రజలు నమ్మరని అన్నారు. ధరణిని రద్దు చేస్తామని స్థానిక ఎమ్మెల్యే భట్టివిక్రమార్క చెబుతున్నాడని, రైతులకు మూడు గంటల కరెంట్ చాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అంటున్నారని విమర్శించారు. వీరి మాటల వెనుక ఉన్న అసలు ఉద్దేశం ఏమిటో ప్రజలకు, రైతులకు బాగా తెలుసునని స్పష్టం చేశారు. వీరికి ఈ ఎన్నికల్లో ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలను కోరారు. ఎన్నో ఏళ్లుగా ఇక్కడి ప్రజల్లో ఒకరిగా ఉన్న తనను ఈ ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు చేబ్రోలు మల్లికార్జునరావు, ఏనుగు నాగేశ్వరరావు, పెనుగొండ ఏడుకొండలు, జెర్రిపోతుల రవీందర్, రామకృష్ణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి ఆశీర్వాదం తీసుకుంటున్న బీఆర్ఎస్ అభ్యర్థి లింగాల